నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | ఏప్రిల్ 26, 2024 | www.navatelangana.com

భారీ నగదు పట్టివేత



నగదు పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి శివారులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి 10 గంటల సమయంలో భారీగా నగదు పట్టుకోవడం జరిగిందని ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ అనే వ్యక్తి మధ్యప్రదేశ్ నుంచి తన ఐచర్ వాహనంలో రూ.53,42,830 తీసుకెళ్తూ పట్టుబడ్డాడని ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపెట్టకపోవడం వలన అట్టి నగదును సీజ్ చేసి ఎన్నికల స్క్రీనింగ్ కమిటీకి అప్పగిస్తామని ఆయన తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించండి : డిఐఇఓ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మే నెల రెండవ తేదీ లోగా ఆయా కళాశాలల్లో ఫీజులు చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి టి.రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యర్థులకు మే 24 నుండి సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ అన్ని కళాశాలలో విద్యార్థుల నుండి బోర్డు నిర్ణయించిన మేరకు ఫీజులను వసూలు చేయాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. అధిక ఫీజులు వసూలు చేసే వారిపై బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు మార్కులలో ఇంప్రూవ్మెంట్ కోసం ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మార్కుల రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ కోసం ఆన్లైన్ ద్వారా ఫీజులు చెల్లించాలని అన్నారు. రీకౌంటింగ్ కు 100 రూపాయలు, రీవాల్యుయేషన్ కు 600 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలిపారు. ప్రభుత్వ , ఎయిడెడ్, రెసిడెన్షియల్ ప్రైవేటు తో పాటు అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాల లాగిన్‌ల ద్వారా విద్యార్థుల నుండి ఫీజులను వసూలుచేసి ఇంటర్ బోర్డుకు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి సుదర్శన్

మలేరియా రహిత

సమాజమే మన లక్ష్యం

- జిల్లా వైద్యాధికారి సుదర్శన్
- నగరంలో అవగహనా ర్యాలీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని జాతీయ కీటకం జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక వినాయక నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా స్థాయి మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. సుదర్శన్ హాజరై ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో మలేరియాపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుదర్శనం మాట్లాడుతూ ఈ సంవత్సరం డబ్ల్యూహెచ్ఓ ఇచ్చిన నినాదం మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయడం అని అన్నారు. మూడు దోమల ద్వారా ఐదు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని అందులో మలేరియా, డెంగ్యూ ,చికెన్ గున్యా మెదడువాపు, బోదకాలు ఉన్నాయని అన్నారు. కానీ జిల్లాలో గత సంవత్సరం నుండి ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. దీనికి కారణం పరిసరాల పరిశుభ్రత పాటించడం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి లాంటి కార్యక్రమాలు నిర్వహించడం, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే ను నిర్వహించడం, రక్తపూతల సేకరణ ఇలాంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఆశాలు, ఏఎన్ఎంలు, పర్యవేక్షక సిబ్బంది విస్తతంగా నిర్వహించడం ద్వారానే సాధ్యమైంది అన్నారు. దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా, చూసుకోవాలని వ్యక్తిగతంగా కుటుంబ పరంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలను వాడడం, ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వినియోగించాని తెలిపారు. కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ మలేరియా సంబంధించిన వ్యాధి లక్షణాలు జిల్లాలో గతంలో, ప్రస్తుతం ఎలాంటి మలేరియా నియంత్రణ చర్యలు చేపడుతున్నారో వివరించారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజ్మతున్నేసా బేగం, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్ఇఓ వెంకట్ రవి, శ్రీనివాస్ నటరాజ్, సిహెచ్ఓ సత్రం, పర్యవేక్షకు రాలు శాంతకుమారి, డిపిఎంఓ శ్రీనివాస్, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వరి కొనుగోలులో

తరుగుదోపిడీ

- క్వింటాలుకు 4 నుంచి 5 కిలోలు
- సన్న రకం 'బి' గ్రేడ్‌లో కొనుగోలు
- పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న రైతులు



నవతెలంగాణ-రామారెడ్డి

వ్యాపారులు, దళారులు నుంచి రైతులను విముక్తి కలిగించేందుకు, ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మద్దతు ధరతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో, పండించిన పంటను విక్రయించు కుంటూ లబ్ధి పొందాలని, ప్రజాప్రతి నిధులు, అధికారులు సూచిస్తున్నారు. నాణ్యానికి ఒకవైపు ఐతే కొనుగోలు కేంద్రాల్లోని తరుగుదోపిడి మరోవైపు. తరుగు పేరుతో కోత పెడుతున్న ధాన్యం విలువ చూస్తే కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2,45290 ఎకరాల్లో యాసంగిలో వరి సాగు చేశారు. పంట కోతలు చేపట్టడంతో, జిల్లా వ్యాప్తంగా 350 కొనుగోలు కేంద్రాల్లో, వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్ రూ.2203, బి గ్రేడ్ రూ.2183గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. కేంద్రాల్లో 40 కేజీల బ్యాగులో, గోనె సంచి బరువుతో కలిపి 40.750 గ్రాములు తూకం వేయవలసిన కొనుగోలు కేంద్రాల్లో 42.500 గ్రాముల వరకు తరుగు పేరుతో తూకంవేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 4 లక్షల 55 వేల టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా, ఒక క్వింటాలుకు 5 కేజీల చొప్పున 22,750 మెట్రిక్ టన్నుల ధాన్యం, దాదాపు రూ.50కోట్లు తరుగు దోపిడితో రైతులను నట్టేట ముంచుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి దోపిడీ జరగద్దని చెప్పిన కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ కొనసాగుతూనే ఉంది. మరోవైపు మార్కెట్లో సన్న రకం బియ్యానికి రూ.5 వేల నుంచి 6000 ధర పలుకుతున్న ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాన్ని బి గ్రేడ్ క్రింద కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తరుగు దోపిడిని అరికట్టి, సన్న రకానికి రూ.2500 చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ధాన్యం తూకం వేస్తున్న దృశ్యం

ప్రభుత్వం వెంటనే దోపిడిని అరికట్టాలి..



రైస్ మిల్లర్లు, కొనుగోలు దారులు కుమ్మక్కై, రైతాంగాన్ని పట్టపగలు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దోపిడిని అరికట్టాలి. ప్రభుత్వం స్పందించకుంటే రైతంగాన్ని కూడగట్టి తరుగు దోపిడిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతాం.

డి.మోతి రామ్ నాయక్,
జిల్లా రైతు సంఘం కార్యదర్శి

తరుగు పేరుతో కొల్లగొడుతున్నరు



కొనుగోలు కేంద్రాల్లో మోసాలు జరగవద్దని ప్రభుత్వం సూచిస్తున్న, కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో ధాన్యాన్ని కొల్లగొడుతున్నారు. మార్కెట్లో సన్న రకానికి డిమాండ్ ఉన్నందున, రైతులు సన్న రకాన్ని సాగు చేయాలని ప్రోత్సహించవలసిన ప్రభుత్వం, సన్న రకాన్ని బి గ్రేడ్‌లో కొనుగోలు చేయడం రైతులను మోసం చేయటమే. సన్న రకం వరి ధాన్యానికి రూ.2500 ప్రకటించి కొనుగోలు చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

నా రెడ్డి మోహన్ రెడ్డి, రైతు, పోసానిపేట్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

ప్రజా వ్యతిరేక మతోన్మాద

బిజెపి పార్టీని గద్దె దించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

దేశంలో ప్రజా వ్యతిరేక పార్టీ అయిన బీజేపీ పార్టీనీ, మోడీని గద్దె దించాలని ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇండియా కూటమి అభ్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీకీ సిపిఎం పార్టీ మద్దతును ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన పది ఏండ్ల కాలంలో దేశంలోని రైతులు, ప్రజలు, కార్మికులు, వృత్తిదారుల వ్యతిరేక విధానాలను అవలంబించిందన్నారు. పెట్టుబడుదారుల ఆస్తులు పెరగడం కోసం దాని విధానాలను మార్చుకుందన్నార. ఒకవైపు దేశంలోని పేదరికాన్ని నిర్మూలించకుండా, నిరుద్యోగాన్ని నివారించకుండా, ఆకలి చావులను అరికట్టకుండా, రైతులకు కనీస మద్దతు ధర కల్పించకుండా, కార్మిక చట్టాల్ని రక్షించకుండా, మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారులను, హింసలను, అరికట్టకుండా, దేశంలోనే ఓబీసీలలో కులగణన చేయకుండా, బడ్జెట్ కేటాయించకుండా బిజెపి పాలన కొనసాగించిందన్నారు. తిరిగి మళ్ళీ మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తుందనీ, ఈరోజు దేశంలోని ప్రధాన సమస్యలు పరిష్కారం చేయకుండా, ప్రజల్లోని సున్నితమైన అంశాలను తీసుకొని భావాద్వేగాలని రెచ్చగొట్టి మతోన్మాదం పేరు మీద కార్మిక పోరాటాలను, ప్రజాపోరాటాలను, రైతుపోరాటాలను అణిచివేస్తుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకి, రాజ్యాంగానికి, ఫెడరలిజానికి, దేశ భవిష్యత్తుకు బిజెపి విధానాల ద్వారా ప్రమాదం వచ్చిందని, ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసిందని అన్నారు. మళ్లీ బిజెపి గెలిస్తే ఈ దేశాన్ని తాక ట్టు పెడుతుందనీ, భారతదేశం చాలా ప్రమాదం లో ఉందనీ ప్రజలు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. మూడోసారి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించడానికి ప్రజలందరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, ఖలీల్, చంద్రశేఖర్, అరుణ్, రాజనర్సు, భాస్కర్, సావిత్రి, సాయిలు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు దరఖాస్తుల

విచారణ వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటు నమోదు దరఖాస్తుల విచారణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల తుది జాబితాలో తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటేసేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ బృందాలను నియమించినట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. వేసవికాలం ఉన్నందున పోలింగ్ కేంద్రాల వద్ద టెంటు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లు వడదెబ్బకు గురికాకుండా చూడవలసిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందని తెలిపారు. ఓటింగ్ లైన్ల వద్ద నీడ వసతి కల్పించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ సిద్ధం చేయాలని తెలిపారు. ఈ నెల 26న ఎన్నికల సిబ్బంది రెండవ దశ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 29న ఈవీఎంల రెండవ దశ రాండమైజేషన్ చేస్తామని పేర్కొన్నారు. వృద్ధులకు, దివ్యాంగుల కోసం రవాణా సదుపాయం కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఏవో మసుర్ అహ్మద్, ఎన్నికల విభాగం అధికారులు జ్యోతి, సరళ, ఉమలత, స్వప్న, ఇందిరా ప్రియదర్శిని, అనిల్ కుమార్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ సెంటర్‌ను సందర్శించిన జనరల్ అబ్జర్వర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్‌ఆర్ గురువారం ఓట్ల లెక్కింపు కేంద్రమైన సీఎంసీ కళాశాలను సందర్శించారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్లోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోల్ అయ్యే ఓట్ల లెక్కింపుతో పాటు నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కూడా సీఎంసీలోనే చేపట్టనున్నారని అధికారులు అబ్జర్వర్ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను, ఆయా సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు గదులు, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ల వద్ద చేసిన ఏర్పాట్లు, వసతులను పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు అబ్జర్వర్‌కు తెలిపారు. ఆమె వెంట జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, మెప్మా పీ.డీ రాజేందర్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జెఈఈ మెయిన్ ఫలితాలలో నారాయణ విజయభేరి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జేఈఈ మెయిన్ 2024 ఫలితాలలో నిజామాబాద్ నారాయణ జూనియర్ కాలేజ్ విద్యార్థి మర్రి హర్ష ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 848 ర్యాంక్, జిల్లాలో అత్యధికంగా 99.62 శాతం సాధించడం జిల్లాకే గర్వకారణం అని నారాయణ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ కుంట లక్ష్మారెడ్డి, ఏవో మేదరి శేఖర్ ,కోర్ డిన్ యు వి ప్రసాద్ , జీఎం కాట్రగడ్డ శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్‌లో మొత్తం 28 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారని, ఇది సరికొత్త రికార్డు అని అన్నారు. 848 ర్యాంకుతో పాటుగా 5908, 14539, 17348 ఇలా 30000 లోపు 28 మంచి ర్యాంకులు ఉన్నట్లు తెలిపారు. నారాయణ విజయప్రస్థానం ప్రారంభమైందని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందని అన్నారు. నారాయణ కాలేజీ నిజామాబాద్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాదులో ఇంటర్ విద్యలో స్థాపించిన రెండవ సంవత్సరంలోనే జిల్లాలో మొదటి సంవత్సరం 2024 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక రాష్ట్ర స్థాయి మార్కులు 467,466,466, 465,465,464,464,462,461 పొందారు, అలాగే ఇంటర్ 2వ సంవత్సరంలో 991, 987, 986, 985, 984, 982, 980 వంటి బెస్ట్ మార్కులతో నిజామాబాదులో కొత్త శకానికి నాంది పలుకుతున్నట్లు అయింది. భవిష్యత్తులో కూడా జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీ ర్యాంకులు, నీట్ ర్యాంకులు సాదిస్తామని, దీనికి తోడ్పడిన మా అధ్యాపక బృందానికి, నారాయణ మేనేజ్మెంట్‌కు సహకారాన్ని ఇచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.



జేఈఈ మెయిన్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు, సన్మానించిన యాజమాన్యం

మందర్నలో కుస్తీ పోటీలు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని మందర్నా గ్రామంలో గురువారం గ్రామస్తులు కుస్తీ పోటీలను నిర్వహించారు. మహారాష్ట్ర సమీప గ్రామాల నుంచి మల్లయోధు లు తరలివచ్చి కుస్తీ పోటీలలో తలపడ్డారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో మంధర్న రవి, మంధర్న లక్ష్మణ్, మేత్రి రాందాస్, మేత్రి గంగాధర్, నాగుల్ గౌడ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



మేడేను జయప్రదం చేయాలి

- ప్రపంచ కార్మికులారా ఏకం కండి
- పోరాడితే పోయేదేమిలేదు బానిస సంకెళ్ళు తప్ప
- అఖిల భారత కార్మిక సంఘాల ట్రేడ్ యూనియన్ (ఏఐడబ్ల్యూటియు)

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలో రోడ్లు భవనాల శాఖ అతిథి గహంలో ఏఐడబ్ల్యూటియు ఆల్ ఇండియా వర్కర్స్ ట్రేడ్ యూనియన్ మేడేను జయప్రదం చేయాలని గురువారం పోస్టర్ల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐడబ్ల్యూటియు రాష్ట్ర నాయకులు భానోత్ రవి మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో బలమైన కార్మిక సంఘం నిర్మాణానికి, కార్మిక సంఘాలు ఐక్యం కావాలని దేశంలో సామజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కావాలంటూ కార్మిక శక్తులన్ని ఐక్యం కావాలన్నారు. అమెరికా, చికాగో నగరాన లక్షలాది మంది ప్రజలు పని దినాన్ని తగ్గించాలని కోరుతూ చేసిన పోరాటంలో తమ ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడి తెచ్చుకున్న కషి ఫలితమే ఈ 8 గంటల పని దినం అని అన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ల తప్ప మేడే రోజున మీరు పని చేస్తున్న స్థలాలలో ప్రతి ఒక్క కార్మికులు జెండా ఎగరవేయాలని అన్నారు. జనాభాలో మెజారిటీ ప్రజలు అయిన ఎస్సి, ఎస్టి, బి.సి, మైనారిటీ, అగ్రవర్గంలోని పేదలు, కార్మికులు రాజ్యాధి కారంలోకి రావడం ద్వారానే దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక సామాజిక సమన్యాయం సిద్ధిస్తుందన్నారు. ఉత్పత్తి రంగాలు అయిన భూమి, పరిశ్రమలపై మెజార్టీ ప్రజలకు, కార్మికులకు హక్కులు లభించటం ద్వారా దేశం అన్ని రంగాలలో ముందుకు వెళుతుందన్నారు. ప్రైవేటీకరణ, సరళీకరణ, నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల వలన సామ్రాజ్యవాదం వలన విధానం మరింత బలపడి శ్రమ దోపిడి పెరిగే కార్మికులు, పేదవారు మరింత పేదవారుగా, ధనికుడు మరింత ధనికుడిగా కార్పోరేట్ దిగ్గజాలుగా అవతరిస్తున్నారు. పారిశ్రామిక రంగం, వ్యవసాయ రంగం, సంఘటిత, అసంఘటిత కార్మిక రంగం దివాల తీస్తున్నదని, ఫలితంగా నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం మరింత పెరుగుతున్నన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. పేదప్రజలు, కార్మికులందరికి ఆరు గ్యారంటీల పథకాలను అందించాలని తెలిపారు. ప్రైవేట్ కంపనీలలో పని చేస్తున్న మహిళలకు సెక్యూరిటి బాధ్యత ఈఎస్ఐ, పిఎఫ్, గుర్తింపు కార్డులను రాష్ట్ర ప్రభుత్వమే అందించాలన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాలలో పని చేస్తున్న కార్మికులందరికి పనికి తగ్గ పారితోషకం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, లేబర్ బోర్డులోని కార్మికుల సంక్షేమ పథకాల నిధులను పక్కదారి పట్టకుండా కార్మికులకు అందే విధంగా చూడాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతోపాటు రైతు బీమా, రైతు భరోసా, రైతు రుణమాఫీ, వరిదాన్యం క్వింటాలకు 500 రూపాయలు బోనస్‌గా ఇవ్వాలని అన్నారు. 8 గంటల పనిదినాన్ని, ప్రభుత్వరంగాన్ని కాపాడుకుందామని, నాలుగు లేబర్ కోడ్లు, రైతు చట్టాల రద్దుకు పోరాడుదామని అన్నారు. కార్పొరేట్ సంస్థల ఆదాయంపై సీలింగ్ విధించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. కనీస వేతన జీఓలను తక్షణమే అమలు చేయాలని, అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ చట్టం తేవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐడబ్ల్యూటియు జిల్లా కార్యదర్శి దేవరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కమ్మరి సత్యం, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పిపావత్ సీతారాం నాయక్, ఏఐడబ్ల్యూటియు జిల్లా సహాయ కార్యదర్శి బోండ్ల రాజు, రామారెడ్డి మండల కార్యదర్శి చాట్ల లింగం, మాచారెడ్డి మండల కార్యదర్శి గడ్డమీది శంకర్, ఏఐడీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి రౌతు శ్రీకాంత్ పాల్గొన్నారు.



మేడే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే పోచారంను కలసిన ఘన్‌పూర్ నాయకులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

లోక్ సభ ఎన్నికల సందర్భంగా పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని, ఇంచార్జి భాస్కర్ రెడ్డిని ఘన్‌పూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీమన్నారాయణ మర్యాదపూర్వకంగా కలిసి మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు. నూతన గ్రామ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. ఈ ఎన్నికల్లో భాగంగా రోడ్‌షోలో గ్రామం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీనివాస్ రెడ్డి తెలిపినట్లు అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, మండల నాయకులు అన్నారు.

ఎల్ఓసి అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

నందిపేట్ మండలంలోని దత్తాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ చికిత్స కోసం హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్లో చేరారు. వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2లక్షల10వేలు వైద్య ఖర్చు నిమిత్తం ఎల్ఓసి గురువారం అందించారు. ఎల్వోసికి సహకరించి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలకు

సత్యశోధక్ పాఠశాల విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సిరికొండ

విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ ఆధ్వర్యంలో ఈనెల 28 పిఎస్ఎం హైస్కూల్ హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గత ఫిబ్రవరి మాసం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ వివిధ విభాగాల పోటీల్లో ఛాంపియన్ షిప్ సాధించిన పాఠశాలకు చెందిన విద్యార్థులు టి. శివాని, యన్. కార్తీక, కె.అనన్య పాటిల్, వి. సాద్వి అబాకస్‌లో పి. యశ్వంత్, వి. వైశ్విక, పి. నవ్యశ్రీ, వేదిక్ మ్యాథ్స్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల నుండి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న ఏడుగురికి ఏడుగురు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికకావడం విశేషం. ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ రీజినల్ ప్రతినిధి మారుతి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనటకు ప్రవేశ పత్రాలు అందించి అభినందించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ... సమయపాలన, నైపుణ్యంతో అభ్యాసం చేస్తూ జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, రాజు, వనిత, జ్యోతి, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

మే 5న కబడ్డీ జిల్లా సంఘం ఎన్నికలు

నవతెలంగాణ-మోపాల్

మే 5న కబడ్డీ జిల్లా సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న నిజామాబాద్‌లోని డిఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఆవరణలో నిర్వహించిన జిల్లా కబడ్డీ కార్యవర్గ సంఘ సమావేశంలో 2024 నుంచి 2028గాను ఎన్నికలను జరపాలని తీర్మానించినట్టు పేర్కొన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బొబ్బిలి చిన్నారెడ్డిని జిల్లా కమిటీ సంఘ ప్రధాన కార్యదర్శి అంద్యాల లింగన్న నియమించారని తెలిపారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఐదుగురు, ప్రధాన కార్యదర్శిగా ఒకరు, సంయుక్త కార్యదర్శి ఐదుగురు, కోశాధికారిగా ఒకరు, కార్యవర్గ సభ్యులుగా 9మందిని ఎన్నుకోనున్నట్టు తెలిపారు. ఈ ఎన్నికలకు గాను నామినేషన్ ప్రక్రియ డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఉంటాయని, మండలాల అధ్యక్ష కార్యదర్శులు ఈ ఎన్నికలో ఓటు హక్కును వినియోగించుకుంటారని పేర్కొన్నారు. ఈనెల 26న నామినేషన్ల నామినేషన్ పేపర్లు రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 28న అభ్యర్థుల నుండి 12 గంటల నుండి 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. 29న నామినేషన్ల పరిశీలన, బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడిస్తారని పేర్కొన్నారు. 30న నామినేషన్ల ఉపసంహరణ 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, మే 1న బరిలో ఉండే అభ్యర్థుల జాబితా వెల్లడిస్తారని తెలిపారు. మే 5 న ఉదయం 10 గంటలకు సర్వసభ్యసమావేశం తదుపరి బ్యాలెట్ విధానం ద్వారా స్థానిక డీఎస్సే స్విమ్మింగ్ పూల్ సుభాష్ నగర్ ఆవరణలో ఎన్నికలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లు

- సద్వినియోగం చేసుకోవాలి:సిడి పిఓ స్వర్ణలత


అసైన్‌మెంట్ కార్డులు అందజేస్తున్న సీడీపీవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అంగన్వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి సిడిపిఓ స్వర్ణలత తెలిపారు. ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఎర్లీ చైల్డ్ ఫుడ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) సమావేశం నిర్వహించారు. సిడిపిఓ స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్వైజర్ శోభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులను పిల్లల బాగోగులు ఇతరత్రా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బాల్య సంరక్ష, విద్య దినోత్సవం సందర్భంగా అంగన్ వాడీ కేంద్రాల్లో నర్సరీ ఎల్కేజీ, యూకేజీ అడ్మిషన్లు జరుగుతున్నాయని తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయని, నాణ్యమైన విద్య అందజేస్తారని తెలిపారు. ప్రీ స్కూల్ అసైన్మెంట్ కార్డులను చిన్నారులకు అందజేసి, అక్షరాభ్యాసం చేయించారు. క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సువర్ణ, అంగన్వాడీ టీచర్లు వనజా, అసిఫా, శారదా, ఐకెపి సిసి ఉదయ్, గ్రామ అధ్యక్షురాలు లక్ష్మీ తోపాటు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్సతోనే మలేరియానుండి బయటపడొచ్చు


డిచ్‌పల్లి: మాట్లాడుతున్న అధికారి వై. శంకర్


రెంజల్: ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, ఆశావర్కర్లు


ఏర్గట్లలో..

- ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రాథమిక ఆరోగ్యం ఇందల్‌వాయి, పరిధిలోని డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కేంద్రాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ దోమల ద్వారానే వ్యాపించే మలేరియాకు సరైన చికిత్స తీసుకోవడం ద్వారా దానినుండి బయటపడవచ్చని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిస్థితి తప్పవని అన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ అనిత ఆరోగ్య కార్యకర్తలు వెంకట్ రెడ్డి, ఆనంద్, శారద, ఇందిర, ఉదయ, రాధిక, అరుంధతి, భానుప్రియ, స్వరూప, మమత, సంతోషి, విజయ సావిత్రి, దేవి మేరీ, రేణుక, కావ్య, గంగుబాయి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్షణాలు..

ఈ జ్వరం ఎనాఫిలిస్ దోమ ద్వారా వస్తుంది. దీనిలో తీవ్రమైన జ్వరం వచ్చి పోవడం తీవ్రమైన చలిగా ఉంటుంది, తలనొప్పి ఒళ్లు నొప్పులు వాంతులు వికారం వంటివి ఉంటాయి. కొందరిలో కామెర్లలక్షణాలు కనిపించవచ్చు. ఫాల్స్ ఈ ఫారం మలేరియా అయితే కిడ్నీలు చెడిపోవడం కోమాలోకి వెళ్ళిపోవడం వంటి ప్రమాదాలు ఉంటాయి

చికిత్స..

అనుమానం రాగానే మలేరియా పరీక్ష చేయించుకోవాలి. యాంటీ మలేరియా మందులు ఎంత త్వరగా మొదలుపెడితే అంత మంచిది. కోర్సు మొత్తం పూర్తిగా తీసుకోవడం చాలా చాలా అవసరం. మలేరియా వ్యాధి తగ్గడానికి రక్షణ కవచాన్ని వాడి.. ప్రాణాలను రక్షించుకోండి..

దోమలు కుట్టకుండా పుట్టకుండా చూసుకుందాం- మలేరియా తరిమికొడదాం.

ప్రతిరోజు డ్రైడేగా పాటిద్దాం..

ఇంట్లో, ఇంటి పరిసరాలు, కాలనీల్లో, గ్రామంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమతెరలు, కాయిల్స్, మస్కిటో లిక్విడ్ వాడుకోవడం అవసరం. మురికి నీటిపై కిరోసిన్ ఆయిల్ కలిగినట్లయితే నివారించుకోవచ్చు. నీటి నిల్వ ఉండకుండా చూడాలి. పరిసరాల్లో జ్వర బాధితులు ఉన్నప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి. వీటిని ప్రతి ఒక్కరు పాటించినట్లయితే ఈ వ్యాధి నుండి బయట పడవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ..

గ్రామంలోని వీధులన్నీ శుభ్రంగా ఊడ్చి, డ్రైనేజీల్లో చెత్త చెదారం తొలగించాలి.వర్షాలకు ముందు తర్వాత మురికి కాలవల్లో పూడికతీత తొలగించాలి. నీరు పారేలా చూడాలి.గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్య కర్తలు, ప్రజల్లో అవగాహన పెంచాలి.వ్యాధులు ప్రబలినప్పుడు ఆరోగ్య సిబ్బందికి తెలియజేసి వారి సలహాలు పాటించాలి.

వ్యక్తిగతంగా తీసుకోవలసిన జాగ్రత్తలు..

ఇంటి పరిసరాల్లో నీరు నిలువకుండా చూడాలిపనికిరాని పాత్రలు, టైర్లు, తొట్లు పగిలిపోయిన బకెట్లు ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూడాలి.ఓరల్ హెడ్ ట్యాంకులు, సంపులు, డ్రమ్ములు, నీటి తొట్ల మీద మూతలు పెట్టాలి.ఇంటి పై కప్పు పైన, సన్ షెడ్ల పైన, టెర్రస్ ల పైన నీరు నిల్వ ఉండకుండా చూడాలి.ప్రతి శుక్రవారం ఫ్రైడేగా చేసి శుభ్రపరిచి ఆరబెట్టి వాడుకోవాలి.ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు మురికి కాలవలో పడేయరాదు. సెప్టిక్ ట్యాంక్ గాలి గొట్టాలకు నైలాన్ సంచులు కట్టడం, ఇంటికి, కిటికీ, గుమ్మాలకు మెస్ డోర్ లు అమర్చాలి. దోమతెరలు వాడటం అలవాటు చేసుకోవాలి.

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు..

మలేరియా వ్యాధి గ్రస్తులను గుర్తించి రక్తపరీక్ష ద్వారా నిర్ధారణ చేసి వారికి తగిన చికిత్సను అందిస్తున్నారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం. ఆరోగ్య కార్యకర్తలు అందరివద్ద రక్త పూతల సేకరణకు చికిత్సకు తగిన సౌకర్యాలు అందచేయడం. వ్యాధి ప్రబలిన చోట దోమలు నియంత్రించడం పొగబెట్టడం. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆరోగ్య పరిసరాల పారిశుద్ధ్యం కార్యక్రమాలు అమలు చేయడం..

రెంజల్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది మలేరియా దోమల నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నోడల్ అధికారి కరిపే రవీందర్ అధ్యక్షతన ఆరోగ్య సిబ్బంది, ఆశాతం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే గా తప్పనిసరిగా నిర్వహించుకోవాలని సూచించారు. తప్పనిసరి గా దోమతెరలు వాడాలని, జ్వరాలు వచ్చిన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సరిస్థాపిర్దోస్ సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, పీహెచ్ఎన్ రాణి, సూపర్వైజర్ మాలంబి, ఎంఎల్‌హెచ్‌పిలు ప్రమోదిత, ఉజ్మ, ఇమాన్, లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలోని పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరిపారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ మాట్లాడుతూ...మనిషి దోమకాటుకు గురికావడం వల్ల మలేరియా, బోధకాలు, మెదడు వాపు, డెంగ్యూ, చికెన్ గున్య మొదలైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి రోగాలు రాకూడదంటే దోమ కుట్ట కుండ,పుట్టకుండా ఉండాలని అన్నారు. దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండకూడదంటే మనం నివసిస్తున్న పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. దోమల వల్ల వ్యాధి బారిన పడ్డాం అనిపిస్తే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని కోరారు. ఇందులోభాగంగా సూపరింటెండెంట్ ఆకుల మారుతి, హెల్త్ అసిస్టెంట్ పండరీ, ఏ.ఎన్.ఎం లు,ఆశాలు పాల్గొన్నారు.

ఆర్మూర్ : మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీని తీసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. మలేరియా జ్వరం ఇనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ దోమలు మురికి నీటిలోనూ చెత్త చెదారాల్లో వృద్ధి చెందుతాయన్నారు. విపరీతంగా జ్వరం, తలనొప్పి, వాంతులు మొదలవుతాయని తెలిపారు. రోజు తప్పి రోజు లేదా రెండు రోజులకు ఒకసారి జ్వరం చలి వస్తుందన్నారు. కార్యక్రమంలో గోవింద్ పెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ మానస, సాయి, హెచ్ఈఓ రవి, ఎంఎల్‌హెచ్‌పి యాస్మిన్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనిని నిర్వీర్యం చేస్తున్న కేంద్రప్రభుత్వం



నవతెలంగాణ-సిరికొండ

ఉపాధి హామీ పనిని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని, ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రకు పూనుకుంటున్నదని ఐఎఫ్టీయూ మండల కార్యదర్శి బుర్ర హీరా భాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆమే మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటినుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్)కు సరిపడా నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు పాల్పడుతుందని అన్నారు. నిధులను తగ్గించడానికి అనేక సమస్యలు సృష్టించి పథకాన్ని పాతరపెట్టే ప్రయత్నం చేస్తుందని అన్నారు. వేసవికాలంలో ఎలాంటి ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక ఉపాధి పనికి వెళుతున్నారని అన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ (ఎన్ ఎం ఎం ఎస్) పేరుతో మొబైల్ యాప్ ని ప్రవేశపెట్టడం కార్మికులకు సమస్య మొదలందని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు 700 రూపాయలు ఇవ్వాలని, వారానికి ఒకసారి మాస్టర్ ప్లే సిప్పులను ఇవ్వాలని అన్నారు. పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని, వారానికి ఒకసారి వేతనాలు చెల్లించాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రెండు వందల 50 రోజులు పని కల్పించాలి రోజుకు 700 రూపాయలు వేతనం ఇవ్వాలని, పని ప్రదేశంలో ఓఆర్ఎస్ మెడికల్ కిట్లు మంచినీళ్లు, టెంటు సౌకర్యం. వైద్య సౌకర్యం సదుపాయాలు కల్పించాలని అన్నారు. పారలు, బొచ్చెలు (తట్టలు) ప్రభుత్వమే అందరికీ ఇవ్వాలని, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ. పిఆర్సిని అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడుకోలు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ అయినా లింగంపల్లి స్వామిని నాలుగు సార్లు సస్పెండ్ చేసిన పై అధికారులు అతనిపై సస్పెన్షన్ వేటు వేసిన మండల అధికారులు ఎందుకు ఆయన పైన మక్కువ చూపుతున్నారని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎంపీడీవో నిర్లక్ష్యమా లేదా ఏపీవో నిర్లక్ష్యమా అర్థం కాని పరిస్థితిలో ఉపాధి హామీ కూలీలు ఉన్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు, ఐఎఫ్‌టియు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించవల్సి ఉండగా వాయిదా పడినట్లు ఎంపిడిఓ అనంత్ రావు తెలిపారు.వ ందస్తుగా నిర్ణయించిన తేదీకి అధికారులు హాజరైన మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎంపిటిసిలు రాకపోవడం, ఎన్నికలు జరుగుతుండటంతో సర్వసభ్య సమావేశానికి రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌కు 15 మంది విద్యార్థినులు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

గురువారం ప్రకటించిన జెఈఈ మెయిన్స్ ఫైనల్ ఫలితాల్లో డిచ్‌పల్లి మండలం లోని దర్మారం(బీ) సాంఘీక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల విద్యార్థినులు మంచి ప్రతిభను సాధించారని కళాశాల ప్రిన్సిపల్ బి.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. జెఈఈ మెయిన్స్‌లో 15 మంది విద్యార్థినులు జెఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాధించారని పేర్కొన్నారు. బి.వర్ష -92.44, టి.తేజశ్రీ-90.87, ఎన్.కృతగ్న-86.76, వై. సంధ్య -85.71, ఎం.అపూర్వ -79.46శాతంతో తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మోడీ మళ్ళీ గెలిస్తే ప్రజలు, ప్రజాస్వామికవాదులు జైళ్లపాలే

- పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్ట్ బిజెపిని ఓడిద్దాం
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్


అభివాదం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

మత రాజకీయలను తన ఎజెండాగా ఎంచుకున్న మోడీ మళ్ళీ గెలిస్తే ప్రజల, ప్రజాస్వామికవాదులు జైళ్లపాలేనని, జైళ్ళే వీళ్ళనివాసలు అయ్యేప్రమాదం వస్తుందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వి. ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సిరికొండ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రజావ్యతిరేఖ ఫాసిస్టు బీజేపీని ఓడించండి' అన్న అంశంపై రాజకీయ పార్టీల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బడా కార్పొరేట్ వర్గాలు ఆదాని అంబానీలకు అనుకూలంగా భారతదేశాన్ని, ప్రజలను మధ్యయుగాలలోకి తీసుకుపోవ దానికి మూఢనమ్మకాలను, మనువాద చాందస భావాలను నూరిపోస్తూన్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చి వేయటానికి కుట్రలు జరుగుతున్నాయని, మతోన్మాద ప్రమాదం నుండి లౌకిక, ప్రజాస్వామిక విలువలను కాపాడుకొనుటకు పార్లమెంటు ఎన్నికలలో బిజెపి, ఆర్ఎస్ఎస్ దాని మిత్రపక్షాలను ఓడించాలని ఆయన పిలుపునుఇచ్చారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ మాట్లాడుతూ.. బిజెపి ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార శక్తులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, చరిత్రకారులు, లౌకికవాదులకు వ్యతిరేకమైన చర్యలను చేపట్టి విధ్వంస రచనకు పూనుకున్నదని ఆయన విమర్శించారు. మైనార్టీలకు పౌరసత్వం లేదంటున్నారనిఅన్నారు.కాంగ్రెస్ సిరికొండ మండల కమిటీ అధ్యక్షులు బాకారం రవి మాట్లాడుతూ ఎన్నికలొస్తేనే బీజేపీ రాముడు,కృష్ణుడు అంటు నీచరాజకీయాలు చేస్తుంది అన్నారు. ఇక్కడ అరవింద్ మోడీపై ఆధారపడితే అక్కడ మోడీ రాముడిపై ఆధారపడుతున్నారని అన్నారు. సమావేశంలో సిరికొండ పీఏసీఎస్ ఛైర్మెన్ చెల్లెం గంగారెడ్డి, రావుట్ల సొసైటీ డైరెక్టర్ బి. బాబన్న, కాంగ్రెస్ నాయకులు దెగం. సాయన్న, చందర్, బంగ్లా. నర్సారెడ్డి, ఏపీకేఎంఎస్ జిల్లా నాయకులు ఈ. రమేష్, కేవీపీఎస్ అధ్యక్షులు మాల్యాల సుమన్,నర్సింగ్ మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కమిటీ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పిస్తున్న ఆర్ఎస్ఈటిఐ

- రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథరెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ విశ్వనాథరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల కేంద్రంలో ఉన్న అర్ఎస్ఈటిఐలో మంచి నాణ్యమైన శిక్షణాలు అందిస్తున్నారని, ఇక్కడ నేర్చుకున్న వారు స్వయం ఉపాధిలో స్థిర పడ్డారని, రాష్ట్ర డైరెక్టర్, తెలుగు రాష్ట్రాల ఇంచార్జి విశ్వనాథ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఘన్పూర్ శివారులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మహిళా కుట్టు శిక్షణా ను అయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజుల్లో టైలరింగ్ శిక్షణ, మగ్గం వర్క్ శిక్షణలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, దీనిని చక్కగా వినియోగించు కోవాలని, ఈ శిక్షణా ద్వారా అందరూ జీవితంలో స్థిరపడాలని సూచించారు. అంతకు ముందు అక్కడ రెండు శిక్షణ తరగతులను పరిశీలించారు. వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది, భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్, ఫ్యాకల్టీ శ్రీలత, ఫరీదతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బిజెపి నాయకులు


కాంగ్రెస్‌లో చెరిన్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి గురువారం గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. మండలానికి చెందిన బండి పోచయ్య, నా రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంద్ర నర్సింలు, మహమ్మద్ అనీఫ్, ఖలీల్, పోతుల భాస్కర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నవతెలంగాణ 3
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శుక్రవారం | ఏప్రిల్ 26, 2024 | www.navatelangana.com

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఏవో



నవతెలంగాణ-బిచ్కుంద
మండల కేంద్రంలోని రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి రాజలింగం గురువారం ప్రారంభించారు. అహర్నిశలు కష్టపడి పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.3180 నిర్ణయించిందని, దళారులకు అమ్ముకొని మోసపోవద్దని ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు నిర్ణయించిన తేదీల వారిగా నిర్వహించడం జరుగుతుందని కార్యదర్శి శ్రావణ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సౌమ్య, సంపత్, సాయి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-పిట్లం
మండల కేంద్రంలోని గద్దె గుండు తండా జాతీయ రహదారి 161పై బుధవారం రాత్రి అందజా 10 గంటల సమయంలో డిసియం వాహనం ఢీ కొని ద్విచక్ర వాహన దారుడు మతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మతుడు మెదక్ జిల్లా ఓట్‌పల్లి మండలం బూత్క్యార్ గ్రామానికి చెందిన సుభాష్ (24) బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పిట్లం నుంచి స్వగ్రామం నకు నేషనల్ హైవేపై రాంగ్ రూట్లో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. డీసీఎం వాహన డ్రైవర్ పరారు అయినట్లు పేర్కొన్నారు. కాగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన సుభాష్

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బిజెపిని ఓడించండి

- వామపక్ష, లౌకిక శక్తులను బలపరచండి
- ఇండియా కూటమి (టీం) అభ్యర్థులను గెలిపించండి
- ఎఫ్ఎంఆర్ఏఐ జాయింట్ జనరల్ సెక్రటరీ కె.సునీల్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
కార్మిక వ్యతిరేక మతోన్మాద బిజెపిని ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులను బలపరచాలని ఇండియా కూటమి (టీం) అభ్యర్థులను గెలిపించాలని కె.సునీల్ కుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ అధ్యక్షతన పార్లమెంటు ఎన్నికలు, కార్మిక వర్గ కర్తవ్యం అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఆ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎఫ్ఎంఆర్ఏఐ జాయింట్ జనరల్ సెక్రటరీ కె. సునీల్ కుమార్ మాట్లాడుతూ కార్మిక వర్గంపై బీజేపీ 10 సంవత్సరాలుగా యుద్ధం చేస్తున్నాదని, కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం ప్రకారం.. 26వేలు చెల్లిస్తే తప్ప సగటు కార్మికుడు బతకలేడని ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్న వేతనాలు పెంచలేదన్నారు. కానీ ఫ్లోర్ లెవెల్ మినిమం వేజ్ రోజుకు 178 రూపాయలుగా బిజెపి నిర్ణయించడం దారుణమని అన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్ లుగా తెచ్చిందని, ఈకోడ్‌ల వల్ల కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోతారని తెలిపారు. సమ్మె హక్కు కాలరాసి 8 గంటల పని 12 గంటలకు మార్చారని అన్నారు. కోట్లాదిమంది అసంఘటితరంగా కార్మికులకు వర్తించే ఈపీఎఫ్ పెన్షన్ నెలకు పదివేలు పెంచాలంటే బిజెపికి మనసొప్పడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించడానికి అంగీకరించడం లేదన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదని, 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చి ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు వేల కోట్ల లాభాలు కట్టబెట్టేందుకు తెగబడిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు బాటలు వేసిందని, గడచిన పదేళ్లలో లక్షా30వేలు మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీ అమలు కాలేదని, 30 లక్షల ఖాళీలు ఉన్నా భర్తీ చేయలేదని 90శాతం నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల చార్జీలు విపరీతంగా పెంచారన్నారు. నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదల బ్యాంక్ అకౌంట్లో 15 లక్షలు డిపాజిట్ చేస్తానన్న వాగ్దానం మర్చిపోయింది. హిందూ- ముస్లింలు ఘర్షణలు పెంచుతున్నది. ఎలక్షన్ బాండ్స్ 16 వేల కోట్ల రూపాయలు వస్తే అందులో 8262 కోట్ల రూపాయలు కేవలం బిజెపి ఖాతాలో పడిందని, రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తుందని, బిజెపి కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తున్న వారిపై ఉపలాంటి చట్టాలను ప్రయోగించి నిర్బంధిస్తుందన్నారు. ఈడి, సిబిఐ, ఈసి, ఐటి వంటి చట్టబద్ధ సంస్థలను తన రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు దుర్వినియోగ పరుస్తుందన్నారు. ఇలాంటి బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ బీజేపీకి ఓట్లు పెరిగిన, సీట్లు పెరిగిన ప్రమాదమే అన్నారు. బిజెపి గెలవడం అంటే రాబోయే కాలంలో కార్మికులకు సంఘాలు, సమ్మె హక్కు ఉండదని, పోరాడే హక్కు, కనీస వేతనాలు ఉండవని అన్నారు. గతంలో ఉన్న జీతాలు తగ్గిస్తారు.. ధరలు పెంచుతారు. పెట్టుబడిదారులకు లాభాలు, కార్మికులకు, రైతు, కూలీలకు బారాలు పెంచుతారని తెలిపారు. కాబట్టి ఇండియా కూటమికి వామపక్ష శక్తులకు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న రోజువారి సమస్యలకు విధానాలకు రాజకీయాలకు అవినాభావ సంబంధం ఉందని, కార్మిక వర్గ ప్రధాన సమస్యలు పరిష్కారం కావాలంటే బిజెపి అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, ఆ విధానాలను అమలు చేస్తున్న బీజేపీని. ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ. జంగం గంగాధర్, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, మోహన్, రాజేష్, సాగర్, పసియోద్దీన్, రేణుక సుకన్య స్వప్న, సహారా బేగం, చిన్న లాలు, పెద్ద సాయిలు, నీలావతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఏషాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఫ్ఎంఆర్ఏఐ జాయింట్ జనరల్ సెక్రటరీ సునీల్ కుమార్

ప్రశాంతంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

- టెన్త్ పరీక్షకు 94 మంది హాజరు
- ఇంటర్‌లో 119 మంది గైర్హాజర్

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి జిల్లాలో గురువారం ప్రారంభమైన ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు 213 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో పదవ తరగతి ఓపెన్ పరీక్షలు ఐదు సెంటర్లలలో, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు ఆరు సెంటర్లలో నిర్వహించారని, పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలకు 759 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 665 మంది విద్యార్థులు హాజరై 94 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 1172 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1053 మంది విద్యార్థులు హాజరై 119 మంది విద్యార్థులు గైరాజరయ్యారని ఆయన తెలిపారు.

27న జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా అధ్యక్షులు సతీష్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి
మండల కేంద్రంలో ఈ నెల 27న కొత్తగూడెం పట్టణంలో జరిగే ప్రగతిశిలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణంలో జరిగే జనరల్ కౌన్సిలింగ్ పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థిసంఘం విద్యార్థుల సమస్యలపై విద్య రంగ సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. విద్యా కాషాయీకరణ కార్పోరేటికరణ వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మోజీ రామ్ నాయకులు తార చంద్, లక్ష్మమాన్, సంతోష్, శ్రీనివాస్, ప్రకాష్ పాల్గొన్నారు.

మే 1న సెలవు దినంగా ప్రకటించాలి

- యూనివర్సిటీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి
- టీయూలో 138 వ మేడే పోస్టర్స్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కళాశాల ముందు 138వ మేడే పోస్టర్స్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి బికోజి మాట్లాడుతూ.. కార్మిక వర్గం హక్కుల కోసం పోరాడి సాధించుకున్నారని, ఈ హక్కుల పోరాటంలో చికాగో కార్మికులు తమ ప్రాణాలను అర్పించారని తెలిపారు. నేడు పాలకులు హక్కులను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలనూ తీసుకువస్తున్నారని, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వటం లేదని , శ్రమ దోపిడి జరుగుతుందని, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. కావున చికాగో కార్మికుల పోరాట స్ఫూర్తి తో హక్కుల కోసం పోరాడాలని అన్నారు. మేడే 1 న సెలవు దినం ప్రకటించాలని కోరారు. కార్మికులందరూ పాల్గొని మేడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మధులిక, సభ్యులు సుధీర్, డాక్టర్ రవీందర్ నాయక్, రమేష్ గులాబ్, గంగాధర్, జమున రాణి, భవాని శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల ముందస్తు బైండోవర్


పాత నేరస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

నవతెలంగాణ-భిక్కనూర్
పార్లమెంట్ ఎన్నికల దష్ట్య భిక్కనూరు మండలానికి చెందిన పాత నేరస్తులు, ఆర్థిక నేరాలకు పాల్పడిన 17 మందిని తహసీల్దార్ ముందు ముందస్తు బైండోవర్ చేసినట్లు సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎన్నికలలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

బిజెపి హటావో-దేశ్ కో బచావో


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి
ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు బ్యాంక్ ఖాతాలో వేస్తానన్న హామీ ఏమయిందని బిజెపిని ప్రశ్నించిన సిపిఐ నాయకులు. గురువారం మండల కేంద్రంలో సిపిఐ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ దుబాస్ రాములు మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో జరుగుతున్నటువంటి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని దేశవ్యాప్తంగా ఇండియా కూటమి నేత్రుత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఓటర్లను కోరారు. ఢిల్లీ మద్యం వ్యాపారి ఎన్నికల బాండ్ల రూపంలో సుమారు రూ.500 కోట్లు బిజెపికి చెల్లించారని అన్నారు. గత 67 సంవత్సరాల్లో 14 మంది ప్రధాన మంత్రులు దేశ అభివృద్ధి కోసం రూ.55 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గత పది సంవత్సరాలలో మోడీ రూ.113 కోట్లు అప్పులు చేసి గతంలో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు పరం చేయడం జరిగిందన్నారు. గత 15 ఏండ్ల క్రితం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ గెలిచిన వెంటనే ప్రతి ఒక్కరికి 15 లక్షలు ఖాతాలో వేస్తానని హామీ ఇచ్చి మోడీ మర్చిపోయారని, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్చడంలో మోడీ విఫలమయ్యారని అన్నారు. గత 10 సంవత్సరాలలో దేశ సంపదను ఖర్చు పెట్టి విదేశీయాత్రలు చేయడం తప్ప దేశానికి మోడీ చేసింది ఏమీ లేదని అందుకే దేశ ప్రజలకు మోడీ హటావో దేశ్ కో బచావో అని ప్రజలకు పిలుపునిస్తున్నామని అన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో సిపిఐ మండల కార్యదర్శి సిపిఐ మండల నాయకులు నల్ల గంగాధర్, చెరుకు తోట సాయిలు, మల్కయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

2040 క్వింటాళ్ల వరి ధాన్యం కొనగోలు

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని పద్మాజివాడి ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని పలుగ్రామలలో వరి కొనుగోలు చేసినట్లు సిఈఓ దెవెందర్ తెలిపారు. పద్మాజివాడి సోసైటి పరిధిలో గురువారం నాటికి 2040 క్వింటాల్‌ల వరి దాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. డబ్బులు కూడ రైతు ఖాతాలో పడినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు.

సొంతగూటికి చేరిన సుభాష్‌రెడ్డి

- ముఖ్యమంత్రి సమక్షంలో అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరిక
- బిజెపికి బిగ్‌షాక్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)
భారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి గురువారం భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వివరాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భారతీయ జనతా పార్టీకి ఎల్లారెడ్డిలో బిగ్‌షాక్ తగిలింది. భారతీయ జనతా పార్టీ వేలాడి నియోజకవర్గ ఇన్‌చార్జి గత అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి 27 వేల ఓట్లు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సాధించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు ఉన్న నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కష్టకాలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పూర్వ వైభవం తీసుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించిన ఫలితం లేకపోవడంతో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. గత కొంత కాలంగా అనుచరులతో చర్చించి యొక్క అభిప్రాయాల మేరకు ఎల్లారెడ్డి అసెంబ్లి నియోజకవర్గ అన్ని మండల ముఖ్య కార్యకర్తలు, నాయకులు అనుచరులతో కలిసి సొంతగూటి కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. సొంతగూటికి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికి ఆయనను అభినందించారు. కష్టపడ్డ వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సూచించారు. పెద్ద ఎత్తున గాంధీభవన్ ముందు కార్యకర్తలతో వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఎల్లారెడ్డి రాజకీయ సమీకరణలు రోజురోజుకు మారుతున్నాయి.


కాంగ్రెస్‌లో చేరిన సుభాస్‌రెడ్డి

రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించిన ఎస్ఆర్‌కె విద్యార్థులు

- విద్యార్థులను అభినందించిన నోడల్ ఆఫీసర్

నవతెలంగాణ-కామారెడ్డి
తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డ్ బుధవారం ప్రకటించిన ఫలితాలలో ఎస్ఆర్‌కె జూనియర్ కళాశాల నుంచి మొదటి సంవత్సరంలో ఎస్.నందిని ఎంపిసి 470కి 466 మార్కులతో రాష్ట్రస్థాయిలోనే మూడవ ర్యాంకు, జిల్లాలో 2వ ర్యాంకు సాధించిందని ఎస్ఆర్‌కె డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరస్పాండెంట్, సీఈఓ డాక్టర్ ఎం.జైపాల్‌రెడ్డి తెలిపారు. బైపీసీలో కె.వి.పూజిత 440కి 432 మార్కులతో రాష్ట్రంలో ఐదవ ర్యాంకు, జిల్లాలో నాలుగవ ర్యాంకు సాధించిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఎస్.స్నేహ 1000 మార్కులకు గాను 979 మార్కులు సాధించడం జరిగిందనీ, ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అభినందించి అనంతరం మాట్లాడుతూ..

మున్ముందు మంచి ఫలితాలను సాధించి కామారెడ్డికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కె డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ దత్తాద్రి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నరేష్ కుమార్, కామర్స్ అండ్ సైన్సెస్ ప్రిన్సిపాల్ మధు సుధన్, అకడమిక్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.


నందిని పూజ స్నేహ

అన్ని మహిళా గ్రామ సంఘాలు

లాభాల బాటలో నడిపించాలి

- ఏపిఎం రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని అన్ని గ్రామ మహిళ సంఘాలు లాభాల బాటలో పయణించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీఎం రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. అన్ని గ్రామ సంఘాలలో బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు, గ్రామ సంఘం రుణాలు, చిన్న సంఘం రుణాలు అందజేస్తూ మహిళా సంఘాలను అభివృద్ధి బాటలో నడిపించాలని తెలిపారు. రుణం తీసుకుని ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వాడుకుని దేశంలో ఆదర్శంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి మహిళ గ్రామ సంఘం అధ్యక్షురాలు చైర్మన్‌గా కొనసాగుతూ పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు ప్రాథమికంగా మౌలిక వసతులు కల్పించే విధంగా ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల మహిళా గ్రామ సంఘం అధ్యక్షులు కమ్యూనిటీ కోఆర్డినేటర్ లు, మండల మహిళా సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపిఎం రవీందర్‌రెడ్డి


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఇంటర్‌లో మైనార్టీ రెసిడెన్సియల్

గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్
నిజామాబాద్‌నగరంలోని నాగారంలోగల మైనార్టీ రెసిడెన్సియల్ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో అద్భుత ఫలితాలలో ప్రతిభ చాటారుని ఆర్ఎల్‌సి నిజామాబాద్ యంఏ బసీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో సయ్యద్ హర్షలాన్ 470 మార్కులకు 466, రాహుల్ 463, సాయి కళ్యాణ్ 462, ఎండి అష్రఫ్ 462, వినోద్ 459 సాధించారని తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరంలో ఎండి సర్ఫరాజ్ 440కిగాను 437, భార్గవ్ 436, ఫైజాన్ అలీ 428 మార్కులు సాధించారని పేర్కొన్నారు. సీ ఈ సీ మొదటి సంవత్సరంలో ఎండి సోఫియాన్ 500లకు 464, కే. ఆనంద్. 459, ఎంపీసీ రెండవ సంవత్సరంలో 1000కి రషీద్ అన్సారీ 961, అబ్దుల్ గని 949, బైపీసీ రెండో సంవత్సరంలో ప్రేమ్ సాగర్ 970, దినేష్ 935 మార్కులు సాధించారని తెలిపారు. సీఈసి రెండవ సంవత్సరంలో ఎండి అది నాన్ 872 మార్కులు తెచ్చుకున్నట్టు తెలిపారు. 94 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆర్ఎల్‌సీ ఎంఏ. బషీర్, కళాశాల ప్రిన్సిపల్ సూర్యకాంత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అభిబా సైదా, కాలేజీ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకాంత్ రెడ్డి మాట్లాడుతూ జరగబోయే ఎంసెట్ పరీక్షల్లో కూడా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 26, 2024 | www.navatelangana.com

ఓటర్ స్లిప్పులు పంపిణీ



నవతెలంగాణ-బోధన్

లోక్ సభ ఎన్నికలను పురస్కరించుకుని సందర్భంగా గురువారం బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ బోధన్ పట్టణంలోని 67, 68, 25, 26 పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఆయన ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరునికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, కావున దానిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికలలో నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు ఆయన వెంట తహసిల్దార్ గంగాధర్ ,బి ఎల్ ఓ లు ఉన్నారు.

ధాన్య కుప్పలను పరిశీలించిన అదనపు కలెక్టర్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ - మాక్లూర్

మండల కేంద్రంలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని జిల్లా అదనపు కలెక్టర్ యస్. కిరణ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఆయనతో పాటు డిఎస్ఒ చంద్ర ప్రకాష్, సివిల్ సప్లై డిఎం జగదీష్, రైతులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును గెలిపించండి

- ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూరు, నాగంపేట్ గ్రామాల్లో గురువారం ఉపాధి పనులవద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, అటు కేంద్రంలో బీజేపీ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే ప్రజల పక్షాన గొంతుకై ప్రశ్నించే బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ను గెలుపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, ఉమ శంకర్, ఆకుల రాజారెడ్డి, భూమేశ్వర్, నవీన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు..

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీచేస్తున్న లయన్స్ సభ్యులు

నవతెలంగాణ- ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్రధాన రోడ్డు మీద వెళ్లే బాటసారులకు స్టూడెంట్స్‌కు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసినట్టు గ్రీన్ అధ్యక్షుడు జెంటిల్ కిడ్స్ ప్రకాష్ తెలిపారు. అనంతరం లయన్ నివేదన్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జన్మదినం సందర్భంగా సేవ కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చెపూర్ గణేష్ రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డి జే దయానంద్, డిజే.వికాస్ టెక్నోసాఫ్ట్ కంప్యూటర్స్ విద్యార్థిని విద్యార్థులు కరెస్పాండెంట్ జితేందర్ రెడ్డి , ఇశ్వరి, నిర్మల బాలు, గట్టడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకర్లకు సన్మానం

- అభినందించిన జిల్లా ఇంటర్ విద్యాధికారి



అభినందిస్తున్న ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి

నవతెలంగాణ - బోధన్

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో బోధన్ పట్టణంలోని ఉషోదయ జూనియర్ కళాశాలకు చెందిన కదం అంకిత ఎంపీసీ సెకండ్ ఇయర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు, అమీనాబేగం సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడంతో గురువారం కళాశాల ప్రాంగణంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి రవికుమార్ వారిని అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదివే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత విజయాలను సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్య ప్రకాష్ , డైరెక్టర్ దుష్యంత్, ప్రిన్సిపల్ ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన జంగం సుజాత రెండు కిడ్నీలు ఫెయిల్ అవ్వడంతో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో తన భార్య ఆస్పత్రి ఖర్చులకోసం దాతలు సహకరించి ఆదుకోవాలని సుజాత భర్త జంగం శ్రీనివాస్ కోరారు. ఇందుకు స్పందించిన గ్రామానికి ఉన్న పలువురు యూత్ సభ్యులు గురువారం రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.2006-07 పదవ తరగతి బ్యాచ్ అంతా కలిసి రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేయగా గ్రామానికే చెందిన ఈగల్స్ యూత్ 2013-14 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయం మొత్తాన్ని శ్రీనివాస్ ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అందించారు.

పెండ్లిలో సాంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్న ఆస్ట్రేలియన్ యువతి



వధూవరులతో ఆస్ట్రేలియన్ యువతి

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ డెలిగేట్ గడ్డం జీవన్ రెడ్డి కొడుకు అరుణ్ రెడ్డి, కోడలు సిరినందన రెడ్డి వివాహానికి వరుడి స్నేహితురాలైన ఆస్ట్రేలియన్ యువతి సియా హాజరయ్యారు. హిందూ సాంప్రదాయ దుస్తువులు ధరించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ వాతావరణం, ఆచార, సాంప్రదాయాలు ఎంతగానో నచ్చాయని అన్నారు. ఇక్కడి ప్రజలు ఇస్తున్న గౌరవానికి కృతజ్ఞతలు తెలిపారు.

జూన్ 12 కల్లా

పాఠశాలల్లో మరమ్మత్తులు పూర్తిచేయాలి

- పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు
- మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠశాలలను బలోపేతం చేయడానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశారని, జూన్ 12 కల్లా అన్ని పాఠశాలలో మరమ్మత్తుల పనులు చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ గురువారం అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, మహిళ గ్రామ సంఘాల అధ్యక్షులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని ఎంపీడీవో సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ హాజరై మాటాడారు. ఇప్పటికే పాఠశాలల్లో గుర్తించిన సమస్యలను పనులను ప్రారంభించిన వారికి 10 శాతం డబ్బులు అడ్వాన్సుగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. చేసే పనుల్లో నాణ్యత ఉండా లన్నారు. ప్రధానోపాధ్యాయులు గ్రామ సభ అధ్య క్షులు కలిసి పాఠశాలల్లో పనులను చేపట్టా లన్నారు. గ్రామ సంఘం ద్వారా పాఠశాలల్లో పనులను చేయించుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. మహిళ విలేజ్ ఆర్గనైజేషన్ ఎవరి ద్వారా పనులు చేయించిన విలేజ్ ఆర్గనైజేషన్ వారికి మాత్రమే డబ్బులు ఇవ్వాలని హెచ్ఎంలకు సూచించారు. పాఠశాలలో చేసి పనులకు హెచ్ఎం పర్యవేక్షణ చేసుకోవాలని అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, కాంపౌండ్ వాల్ పనులు చేయాలన్నారు. సమావేశంలో ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఇ సురేంద్ర వర్మ, ఏటీఎం రవీందర్ రెడ్డి మండలంలోని ఉపాధ్యాయులు, అన్ని గ్రామాల గ్రామ మహిళ సంఘాల అధ్యక్షులు, ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 400 కూలి

- సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి



మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలీలకు రోజుకు 400 రూపాయల కూలీ అందజేస్తామని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని పల్లికొండ, పిప్రి, బెజ్జోర గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటు అభ్యర్థి జీవన్ రెడ్డి ని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి కూలీలతో మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా ఉపాధి హామీ కూలి పనిని ప్రారంభించింది సోనియా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు, మళ్లీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీలకు 400 రోజువారి కూలి కల్పిస్తామని, అట్లాగే రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రైతులకు రుణమాఫీ చేసింది డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటిని కూడా పూర్తి చేస్తామని అన్నారు. రైతు రుణమాఫీ 2 లక్షలు పూర్తిస్థాయిలో చేస్తామని తెలిపారు. రాబోయే వర్షాకాలం పంటకు వడ్లకు అదనంగా 500 బోనస్ ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. మోడీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు చేసిందని గుర్తు చేశారు. కావున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ జీవన్ రెడ్డి చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయనతోపాటు భీంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరే స్వామి.పట్టణ అధ్యక్షులు జేజే నరసయ్య.డిసిసి డెలికేట్ కుంట రమేష్, బాల్కొండ నియోజకవర్గ యువజన అధ్యక్షులు నాగేంద్రబాబు, నిజామాబాద్ యువజన ఉప ఉపాధ్యక్షులు వాక మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు.అనంత రావు,బీసీ సెల్ అధ్యక్షులు కోరాడి రాజు, పల్లికొండ ఎంపిటిసి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లోడింగ్‌పై కూలీల వివాదం



ఇసుకను లోడ్‌చేస్తున్న కూలీలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం సిద్దాపూర్ శివారులోని మంజీరా నదిలో ఇసుక పంచాయితీ మళ్లీ వేడెక్కింది. ఇసుక లోడింగ్ చేయడంపై మళ్లీ కూలీల మధ్య వివాదం చెలరేగింది. ఇసుక నింపడంలో కూలీల మధ్య వివాదంతో గురువారం ట్రాక్టర్లు, టిప్పర్లు, పెద్ద ఎత్తున మంజీరా నదిలో నిలిచిపోయాయి. కొందరు ఇసుక మాఫియా వ్యక్తులను అధికారులే ప్రోత్సహించి వేబిల్లులు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గురువారం ఏర్పడిన వివాదం పై ఫిర్యాదులు చేసిన సంబంధిత శాఖ అధికారులు స్పందించడంలో నిర్లక్ష్యం వహించారని విమర్శలు వస్తున్నాయి. మంజీరా నది నుంచి ఇసుక తరలింపు విషయంలో రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయలోపంతో ఇసుక మాఫియా ఇష్టారీతిన ఇసుక దోపిడి చేస్తున్నట్లు అంతటా విమర్శలు వస్తున్నాయి.

సజావుగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల సర్వసభ్య సమావేశం గురువారం11గంటలకు ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖలపై చర్చించారు. మొదటగా వ్యవసాయంపై సుదీర్ఘంగా చర్చించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయాధికారి రాజ్ కుమార్ సమాధానం అందించారు. విద్యుత్, మినరల్ వాటర్, సాగునీరు తదితర అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం పదోతరగతి పూర్తి చేసిన అర్భన్, సెమి అర్బన్ అనగా తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల హైదరాబాద్‌లో ఉచితంగా చేర్పుకుంటారనిఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి తెలిపారు. విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్, ఎంపీవో భరత్ చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదింటి కుసుమానికి ఇంటర్‌లో స్టేట్‌ర్యాంక్

- ప్రతిభను చాటిన ఆణిముత్యాలు



అక్షర



సాయిచరణ్

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం మారుమూల గ్రామమైన బాగేపల్లి గ్రామానికి చెందిన తేనే అక్షర (467/470), పాముల సాయి చరణ్ (466/470) మార్కులతో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఎస్ఆర్ కాలేజీలో చదివిన వీరు ఉత్తమ ర్యాంకులను సాధించి గ్రామానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. సరైన బస్సు సౌకర్యం లేకపోయినప్పటికీ విద్యార్థులు కాలినడకన కూనేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యను అభ్యసించారు. పదవ తరగతిలో లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో చదివి ఇంటర్ ఎస్ఆర్ కాలేజీలో చేరారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆటో రిక్షాను నడిపిస్తూ తన ముగ్గురు కూతుర్లను చదివించిన తండ్రి అనిల్ ను గ్రామస్తులు అభినందించారు. తమ కూతురు స్టేట్ ర్యాంకును సాధించడం అభినందనీయమని తండ్రి పేర్కొన్నారు.

జేఈఈ-2024 ఫలితాల్లో వెక్టార్ విజయకేతనం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్స్ బుధవారం ప్రకటించిన ఫలితాల్లో నిజామాబాద్ నగరంలోని వెక్టార్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలతో రాణించారు. దారం హృదయ్ 98.76శాతం, బత్తుల సహర్ష 94.33 శాతం, మామూళ్ల సాయి దుర్గ 94.20 శాతంతో వివిధ ఎన్ఐటి లలో సీటు సాధించగలిగే ర్యాంకులు పొందారని సంస్థ యాజమాన్యం, కళాశాల చైర్మన్ మధుసూదన్ జోషి, డైరెక్టర్స్ గజానన్ సంతోష్, కార్తీక్ తెలిపారు. మొత్తం 25 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌కి సన్నద్ధం కాగా వివిధ కేటగిరుల్లో 17 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాధించారని అన్నారు. సాధారణ స్థాయిలో స్కూలింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులతోనే అత్యుత్తమ ర్యాంకులు సాధించగలిగామని పట్టుదల అంకిత భావంతో చేసిన కృషివలనే మంచి ఫలితాలు సాధిస్తున్నామని, విద్యార్థులను అభినందించారు.





నిజామాబాద్ ఎంపీ సీటు బీఆర్ఎస్‌దే

- పార్టీ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఒక్క ఆర్మూర్ నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల మెజార్టీ ఇచ్చి నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు అఖండ విజయం చేకూరుస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్ విజయాన్ని కాంక్షిస్తూ ఆర్మూర్‌లో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ సీటు బీఆర్ఎస్ దేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా వంచకకాంగ్రెస్, రైతు ద్రోహి బీజేపీలకు శృంగభంగం తప్పదన్నారు. ఇక్కడి ఎంపీ అరవింద్ పసుపుబోర్డు తేకుండా రైతులను నిలువునా ముంచిన వంచకుడని, ఎంపీగా ఆర్మూర్‌కు నయా పైసా పని చేయలేదని, ఒక్క పేదవాడికి ఇల్లు కట్టివ్వలేదని, ఏనాడూ ప్రజలను కలవలేదని దుయ్యబట్టారు.

ఇక కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఇక్కడ పనేమిటి? జగిత్యాలలో చెల్లని రూపాయి నిజామాబాద్ లో చెల్లుతుందా? అసెంబ్లీఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు బుట్ట దాఖల య్యాయి. గ్యారంటీలు, వారంటీలు పోయి ఇప్పుడు ఓట్ల మీద ఒట్లు పెట్టుకుంటున్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేక బీఆర్ఎస్‌పై తిట్ల పురాణం మొదలుపెట్టారని అన్నారు. రైతుబంధు 15వేలకు పెంచలేదని, కేసీఆర్ అమలు చేసిన 10వేలు చాలామంది రైతులకు ఇవ్వలేదని, కళ్యాణలక్ష్మీ, తులం బంగారం హామీ నెరవేర్చడం లేదని అన్నారు. గృహిణులకు ఇస్తామని హామీ ఇచ్చిన రూ. 2500, రైతుల రుణమాఫీ గంగలో కలిసిందని, కరెంట్ కోతలు ప్రజలకు వాతలు పెడుతున్నాయని తెలిపారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు లేవు, సాగునీళ్ళు లేక భూములు ఎండిపోయాయని, కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరు పేర్కొన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం పాటుపడటం లేదన్నారు.

ఒక్క రూపాయికే ఉచిత వైద్యం అందిస్తానన్న హామీ ఏమైందని నిలదీశారు. కనీసం ఒక్క అనారోగ్య బాధితుడినైనా రాకేశ్ రెడ్డి ఆదుకోలేదన్నారు. తన హయంలోనే ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ను గెలిపించే బాధ్యతను తమ భుజాలపై వేసుకోవాలని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు,బోధన్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆయేషా ఫాతిమా షకీల్,జడ్పి చైర్మన్ విఠల్ రావు, కూరపాటి అరుణ జ్యోతి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిఎడ్. సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బి.ఎడ్. మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఏడవరోజు ప్రశాంతంగా జరిగాయి. గురువారం జరిగిన పరీక్షలకు 412 మంది విద్యార్థులకు 388 మంది విద్యార్థులు హాజరయ్యారు 24 మంది గైరాజరయ్యారు.

బి.ఎడ్ పరీక్ష కేంద్రాలు..

గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాళాశాల నిజామాబాద్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ ఆర్ ఎన్ కే ప్రభుత్వ డిగ్రీ కాళాశాల బాన్సువాడ,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్, ప్రభుత్వ డిగ్రీ కాళాశాల బోధన్ సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆడి సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.